జడ్జి విద్వేష పూరిత ప్రసంగం?

అలహాబాద్ హైకోర్టును నివేదిక కోరిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ/లక్నో, డిసెంబర్ 10: విశ్వ హిందూ పరిషత్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో న్యాయ నైతికతను ఉల్లంఘించి జడ్జి శేఖర్ కుమార్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ వచ్చిన ఆరోపణలపై నివేదిక పంపాలని అలహాబాద్ హైకోర్టుకు సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. విద్వేషపూరిత ప్రసంగం చేసిన జడ్జిపై అభిశంసన తీర్మానం పెట్టాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. డిసెంబర్ 8న వీహెచ్‌పీ యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో జడ్జి శేఖర్ కుమార్ మాట్లాడారు. సామాజిక సామరస్యం, లౌకిక వాదం, లింగ సమానతను ప్రోత్సహించడమే యూనిఫామ్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి) ప్రధాన ధ్యేయమని అన్నారు. అయితే ఒక రోజు అనంతరం రెచ్చగొట్టే అంశాలపై జడ్జి చేసిన ప్రసంగాలు వైరల్ కావడంతో విపక్షాలు సహా పలు వర్గాల నుంచి వ్యతిరేకత రావడమే కాక విద్వేషపూరిత ప్రసంగం చేసిన జడ్జిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

సిరియాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

దాడులపై స్పందించని హెచ్‌టీఎస్.. సిరియా ఆపద్ధర్మ ప్రధానిగా బషీర్

డమాస్కస్, డిసెంబర్ 10: తీవ్ర సంక్షోభం నెలకొని ఉన్న సిరియాపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఆకస్మికంగా దాడులకు దిగాయి. ఆ దేశ రాజధాని డమాస్కస్‌లో 25 కిలోమీటర్ల వరకు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చొచ్చుకు వచ్చాయని సిరియన్ ప్రతిపక్ష వార్ మానిటర్ మంగళవారం తెలిపింది. అయితే ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ ఖండించింది. అసోసియేటెడ్ ప్రెస్ తెలిపిన వివరాల ప్రకారం సిరియా నగరం, సబర్బన్ ప్రాంతాల్లో భారీ యెత్తున వైమానిక దాడులు జరిగాయి. సిరియా గగనతలంలో మిస్సైల్ లాంచర్లు, హెలికాప్టర్లు చక్కర్లు కొడుతున్న దృశ్యాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దాడులపై తిరుగుబాటుకు నేతృత్వం వహించి సిరియాను ఆక్రమించుకున్న హయత్ తాహిర్ అల్ షామ్ (హెచ్‌టీఎస్) ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికే సిరియాలోని సుమారు 400 కిలోమీటర్ల పరిధిలోని బఫర్‌జోన్ గోలన్ హైట్స్‌ను ఇజ్రాయెల్ దళాలు ఆదివారం స్వాధీనం చేసుకున్నాయి. సిరియా అతివాదుల పాలనలోకి వెళ్లనున్నందున ముందు జాగ్రత్త చర్యగా ఆ దేశంలోని రసాయన ఆయుధగారాలు, భారీ ఆయుధ స్థావరాలపై దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ తెలిపింది.

ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ధ్వంసమైన సిరియాలోని ఓ నౌకా స్థావరం

రెబల్స్ తాత్కాలిక ప్రభుత్వం

అధికారాన్ని కైవసం చేసుకున్న సిరియన్ తిరుగుబాటుదారులు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆపద్ధర్మ ప్రధాన మంత్రిగా మహమ్మద్ అల్ బషీర్ పేరును ఖరారు చేశారు. ఈ తాత్కాలిక ప్రభుత్వం మార్చి 1 వరకు అధికారంలో ఉంటుందని దేశ అధికారిక టెలివిజన్ టెలిగ్రామ్ అకౌంట్‌లో ప్రకటించారు. ఇంతకుముందు వాయువ్య సిరియా, ఇడ్లిబ్‌లోని కొన్ని ప్రాంతాలను పాలించిన హయత్ తహ్‌రిర్ అల్ షామ్(హెచ్‌టీఎస్) ప్రభుత్వాధినేతగా వ్యవహరించారు.

'మానవ వధశాల'లో దారుణ పరిస్థితులు

అసద్ పాలన నుంచి విముక్తి లభించడంతో సంబరాలు చేసుకుంటున్న సిరియా ప్రజలు.. సైద్నాయ జైలులోని దారుణ పరిస్థితులు చూసి చలించిపోయారు. అసద్ పాలనను వ్యతిరేకించేవారిని 'మానవ వధశాల'గా పిలిచే ఈ జైలులో బంధించే వారు. కనీసం కిటికీలు కూడా లేని చిన్న చిన్న గదుల్లో పదుల సంఖ్యలో ఖైదీలను పెట్టి హింసించేవారు. అసద్‌ను వ్యతిరేకించిన వేలాది మంది సిరియన్లు కనిపించకుండా పోయారు. వీరిని వెతుక్కుంటూ బంధువులు సైద్నాయ జైలులోకి చొచ్చుకెళ్లారు. తిరుగుబాటుదారులు అడ్డుకున్నా లెక్కచేయకుండా వెళ్లి బందీలుగా ఉన్న వారిని విడిపించారు. అనేక ఏండ్ల తర్వాత తమ ఆత్మీయులను చూసుకొని కన్నీరు పెట్టుకున్నారు. ఈ జైలులో భూగర్భంలో ఐదు అంతస్థులు ఉన్న అండర్‌గ్రౌండ్ జైలు కూడా ఉంది. అసద్ వ్యతిరేకులను ఇక్కడికి తీసుకొచ్చి విద్యుత్తు షాక్ ఇవ్వడంతో పాటు దారుణంగా హింసించే వారని చెప్తున్నారు. ఈ జైలులో 2011 నుంచి 2016 మధ్య 13 వేల మంది సిరియన్లను ప్రభుత్వ బలగాలు రహస్యంగా హతమార్చాయని మానవ హక్కుల సంస్థలు చెప్తున్నాయి.

లింగాయత్‌ల కోటా పోరు హింసాత్మకం

కర్ణాటకలో నిరసనకారులపై పోలీసుల లాఠీచార్జి

బెంగళూరు: కర్ణాటకలో తమకు రిజర్వేషన్ కోటాను పెంచాలని కోరుతూ లింగాయత్ పంచమశాలి శాఖ మఠాధిపతి బసవజయ మృత్యుంజయ స్వామీజీ సారథ్యంలో నిరసనకారులు చేపట్టిన ఆందోళన మంగళవారం బెళగావిలో హింసాత్మకంగా మారింది. శీతాకాల సమావేశాలు జరుగుతున్న అసెంబ్లీని ముట్టడించేందుకు నిరసనకారులు ప్రయత్నించగా వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ చార్జి చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చని పక్షంలో అసెంబ్లీని దిగ్బంధిస్తామని హెచ్చరిస్తూ ఆందోళనకారులు విధాన్ సౌధకు బయల్దేరడంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు బలప్రయోగం చేశారు. బీజేపీ నాయకులతోపాటు స్వామీజీని పోలీసులు ముందస్తు కస్టడీలోకి తీసుకున్నారు. ప్రభుత్వ వాహనాలతోపాటు ఎమ్మెల్యేలకు చెందిన వాహనాలను సైతం నిరసనకారులు ధ్వంసం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేసిన పంచమశాలి శాఖకు ప్రస్తుతం ప్రభుత్వ విద్యా సంస్థలు, ఉద్యోగాలలో 5 శాతం రిజర్వేషన్ ఉంది. దీన్ని 15 శాతానికి పెంచాలని వారు ఆందోళన చేపట్టారు.

ఈవీఎంలు వద్దు!

మహారాష్ట్రలో మరో గ్రామం తీర్మానం

పుణె: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై దేశ వ్యాప్తంగా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలో తమకు ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పేపరే కావాలంటూ మరో గ్రామం డిమాండ్ చేసింది. ఇక ముందు గ్రామంలో జరిగే ఏ ఎన్నిక అయినా బ్యాలెట్ పేపర్ ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్ర సతార జిల్లాలోని కొలేవాడి గ్రామ సభ తీర్మానించింది. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు డిసెంబర్ 2న ఈ తీర్మానం చేసినట్టు సర్పంచ్ భర్త మంగళవారం తెలిపారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌పై సుప్రీంకు ఇండియా కూటమి

న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో అనూహ్య పరాజయం పొందిన ఇండియా కూటమి.. ఈవీఎంల రిగ్గింగే తమ ఓటమికి ప్రధాన కారణమని భావిస్తున్నది. ఈవీఎంల్లో అనేక అవతవకలు జరిగినట్టు కూటమి ఆరోపించింది. అయితే దీనిని ఈసీ తిరస్కరించింది. దానితో సంతృప్తి చెందని కూటమి నేతలు ఈవీఎంల అవకతవకలపై సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నారు. శుక్రవారం లోగా దీనిపై పిటిషన్‌ను వేస్తారని కూటమి నేతలు తెలిపారు.

మాధవ్ గాడ్గిల్‌కు 'చాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డ్'

ఐరాస అత్యున్నత పర్యావరణ పురస్కారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: ఐక్యరాజ్యసమితి (ఐరాస) అత్యున్నత పర్యావరణ పురస్కారం 'చాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డ్'కు భారత్‌కు చెందిన ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త మాధవ్ గాడ్గిల్ (82) ఎంపికయ్యారు. 2024 ఏడాదికి సంబంధించి అవార్డ్ గ్రహీతల జాబితాను ఐరాస మంగళవారం విడుదల చేసింది. ప్రపంచంలోనే అత్యంత జీవ వైవిధ్యాన్ని కలిగిన పశ్చిమ కనుమల్లో పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ పురస్కారానికి ఐరాస ఎంపికచేసింది. ఈ ఏడాది అవార్డు గ్రహీతల్లో భారత్ నుంచి మాధవ్ గాడ్గిల్ ఒక్కరికే చోటు దక్కింది. గతంలో కేంద్రం ఏర్పాటుచేసిన ప్యానెల్‌కు మాధవ్ గాడ్గిల్ నేతృత్వం వహించారు. పురస్కారానికి ఎంపిక కావటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

వారానికి 4 రోజులే పని!

జపాన్ ప్రభుత్వం కొత్త విధానం

పిల్లల్ని కనేందుకు ఆఫర్లు

టోక్యో: దేశంలో జననాల రేటును పెంచేందుకు జపాన్ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతున్నది. వారానికి నాలుగు రోజుల పని దినాలను అమలు చేయాలని నిర్ణయించింది. దీని వల్ల క్షీణిస్తున్న సంతానోత్పత్తి సమస్యను ఎదుర్కోవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. జపాన్‌ను ప్రస్తుతం వృద్ధ జనాభా సంఖ్య ఆందోళనకు గురిచేస్తున్నది. దేశ జనాభా మొత్తంగా తగ్గుతున్నప్పటికీ 65 ఏండ్లు పైబడిన వృద్ధులు దేశంలో 29.3%మంది ఉండడం ప్రభుత్వాన్ని ఆందోళనపరుస్తున్నది. కొత్త విధానం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు వారానికి 3 రోజులు కుటుంబంతో గడపవచ్చు. టోక్యో మహిళా గవర్నర్ యురికో కొయికే ఈ ఆలోచనను అమలు చేయనున్నారు.

'విల్లో'తో కంప్యూటింగ్ విప్లవం

- గూగుల్ క్వాంటమ్ చిప్ ఆవిష్కరణ
- సూపర్ కంప్యూటర్ల బలాదూర్



న్యూయార్క్, డిసెంబర్ 10: క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో గూగుల్ సరికొత్త విప్లవాన్ని సృష్టించింది. 'విల్లో' పేరుతో కొత్త క్వాంటమ్ చిప్‌ను ఆవిష్కరించింది. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న వేగవంతమైన సూపర్ కంప్యూటర్ల కంటే ఇది గణనీయమైన వేగంతో పని చేస్తుందని గూగుల్ పేర్కొన్నది. కంప్యూటింగ్‌లో ఎర్రర్‌లను తగ్గించడంతో పాటు వేగాన్ని భారీగా పెంచడం 'విల్లో' ప్రత్యేకత అని ప్రకటించింది. కంప్యూటర్ల వేగాన్ని పరీక్షించేందుకు ప్రమాణంగా పేర్కొనే రాండమ్ సర్క్యూట్ సాంప్లింగ్(ఆర్‌సీఎస్) లెక్కను ఇది కేవలం ఐదు నిమిషాల లోపే పూర్తి చేసింది. ఇదే లెక్క ప్రపంచంలోనే వేగవంతమైన సూపర్ కంప్యూటర్ చేయడానికి 10 సెప్టిల్లియన్ సంవత్సరాలు పడుతుంది. సెప్టిల్లియన్ సంవత్సరాలు అంటే మన విశ్వం వయసు కంటే ఎక్కువ. సంక్లిష్టమైన గణిత సమస్యలను సంప్రదాయ కంప్యూటర్ వ్యవస్థల కన్నా వేగంగా క్వాంటమ్ ప్రాసెసర్లు పరిష్కరించగలవని విల్లో నిరూపించిందని గూగుల్ పేర్కొన్నది. అమెరికాలోని శాంటా బర్బరలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో విల్లోను గూగుల్ అభివృద్ధి చేసింది. సంప్రదాయ కంప్యూటర్ల ద్వారా చేయలేని అల్గారిథంలను నిర్వహించడంలో విల్లో కీలక అడుగు అని ఈ సందర్భంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. సాంకేతిక పురోగతి, సామాజిక ప్రయోజనంలో కొత్త యుగానికి విల్లో మనల్ని మరింత చేరువ చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన చేసిన పోస్ట్‌కు టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ స్పందిస్తూ..'అద్భుతం' అని బదులిచ్చారు.

భూమికి సత్తువనిచ్చే ప్లాస్టిక్!

- పర్యావరణ కాలుష్యానికి చెక్
- జపాన్ పరిశోధకుల ఆవిష్కరణ

టోక్యో: పర్యావరణ హితకరమైన ప్లాస్టిక్ తయారీలో జపాన్ శాస్త్రవేత్తలు విప్లవం సృష్టించారు. సముద్రపు నీటిలో కలిసి, కొద్ది గంటల్లోనే ఈ ప్లాస్టిక్ కరిగిపోతుంది. దీనిని ఆర్ఐకేఈఎన్ సెంటర్ ఫర్ ఎమర్జెంట్ మ్యాటర్ సైన్స్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ ప్లాస్టిక్‌ను ప్యాకేజింగ్ నుంచి మెడికల్ డివైసెస్ వరకు అన్ని రకాల వస్తువుల తయారీకి ఉపయోగించవచ్చు. వేర్వేరు పరిశ్రమల్లో వాడటానికి సురక్షితమైన, విషరహిత పదార్థాలతో దీనిని తయారు చేశారు. సాధారణ ప్లాస్టిక్స్ ఈ విధంగా కరగాలంటే వందల సంవత్సరాలు పడుతుంది. జపాన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ప్లాస్టిక్ సముద్ర జలాల్లో కొద్ది గంటల్లోనే కరిగిపోతుంది. భూమిలో కలిస్తే 10 రోజుల్లో క్షీణిస్తుంది.

భార్య వేధింపులపై 24 పేజీల సూసైడ్ నోట్

బెంగళూరులో యూపీ టెకీ ఆత్మహత్య

బెంగళూరు, డిసెంబర్ 10: భార్య, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక ఉత్తరప్రదేశ్‌కు చెందిన 34 ఏండ్ల టెకీ బెంగళూరులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి 24 పేజీల సుదీర్ఘమైన సూసైడ్ నోట్‌ను, 1.5 గంటల వీడియోను అతడు రికార్డ్ చేశాడు. తన భార్య, ఆమె కుటుంబ సభ్యులు తనపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారని అతడు వెళ్లగక్కిన ఆవేదన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు అతుల్ సుభాశ్ సోమవారం తన నివాసంలో ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ తీవ్రమైన నిర్ణయం తీసుకోవడానికి ముందు అతడు తన సూసైడ్ నోట్, వీడియోను పలువురికి ఈ-మెయిల్ చేశాడు. తాను సభ్యుడిగా ఉండే ఎన్జీవో వాట్సప్ గ్రూప్‌లోనూ షేర్ చేశాడు. 'న్యాయం బకాయి ఉంది' అన్న ప్లకార్డును తన ఇంట్లో వేలాడదీశాడు. సూసైడ్ నోట్‌లో తన భార్యతో కొనసాగుతున్న వైవాహిక బంధ వివాదం గురించి పేర్కొన్నాడు. భరణం కోసం తమ నాలుగేండ్ల కొడుకును తన భార్య తనపైకి అస్త్రంగా ప్రయోగించిందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ కుటుంబ న్యాయస్థానంలో తనపై తన భార్య కుటుంబం పెట్టిన కేసుల్లో హత్య, అసహజ శృంగారం, భరణం కోసం నెలకు రూ.2 లక్షల డిమాండ్ ప్రధానమైనవని వెల్లడించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, టెకీ ఆత్మహత్య నేపథ్యంలో 'మెన్‌టూ' అన్నది ఎక్స్‌లో ట్రెండింగ్‌గా మారింది. చట్టాలన్నీ మహిళలకు అనుకూలంగానే ఉన్నాయని నెటిజన్లు పోస్టులు పెట్టారు.

వాతావరణ మార్పులతో ఆరోగ్య సమస్యలు

'క్లైమేట్ చేంజ్ అండ్ రెస్పిరేటరీ డిసీజెస్' అధ్యయనం వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): వాతావరణ మార్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నట్టు వాతావరణ, ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. వాతావరణ మార్పుల వల్ల గాలి, నీరు, ఆహార కాలుష్యం పెరుగుతున్నదని, దీంతో ఎలర్జీలతోపాటు గుండె, శ్వాస నాళాలు, కీళ్ల వ్యాధులు పెరుగుతున్నాయని ఓ అధ్యయనం వెల్లడించింది. ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల శరీరంలో నీటి శాతం తగ్గి వడదెబ్బతోపాటు మూత్రపిండ వ్యాధులకు, రక్తపోటులో మార్పులకు దారితీస్తున్నదని, దీంతో గుండెపోటు, పక్షవాతం లాంటి జబ్బుల ముప్పు పెరుగుతున్నదని 'క్లైమేట్ చేంజ్ అండ్ రెస్పిరేటరీ డిసీజెస్' అధ్యయనం తేల్చింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల గర్భిణుల్లో వాతం, గర్భస్రావం, నెలలు నిండక ముందే ప్రసవించడం లాంటి సమస్యలు తలెత్తుతున్నట్టు నిపుణులు తెలిపారు. ఉష్ణోగ్రతలు భారీగా తగ్గడం వల్ల కూడా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, చలిగాలుల వల్ల ఊపిరితిత్తుల పనితీరు మందగిస్తుందని వివరించారు. శీతాకాలంలో చలి అంతగా లేకపోతే దోమలు వృద్ధి చెందుతాయని, ఫలితంగా డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు విజృంభిస్తాయని పేర్కొన్నారు. నీటి కాలుష్యం వల్ల కడుపు నొప్పి, వాంతులు, విరేచనాల్లాంటి సమస్యలు తలెత్తుతున్నాయని, కొన్నిసార్లు ఇవి ప్రాణాంతకంగానూ పరిణమిస్తున్నాయని తెలిపారు.

ఉన్నత విద్యామండలిలో ఇష్టారాజ్యం

- కన్సల్‌టెంట్ల పేరుతో రిక్రూట్‌మెంట్
- వివాదాస్పదమవుతున్న నియామకాలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉన్నత విద్యామండలి ఇష్టారాజ్యంగా కీలక పదవులను సృష్టించి తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కన్సల్‌టెంట్ల పేరుతో రిక్రూట్‌మెంట్ చేసుకోవడం వివాదాస్పదమవుతున్నది. ఇప్పటికే నలుగురిని నియమించగా, నేడో, రేపో మరో ఇద్దరిని నియమించుకునేందుకు పావులు చకాచకా కదుపుతున్నారు. వీరిలో ఒకరిని ఓఎస్డీగా, మరొకరిని రీసెర్చ్ కోసం, ఒకరిని ఇండస్ట్రీ కో ఆర్డినేటర్‌గా నియమించారు. వీరికి లక్ష నుంచి రూ. 50వేల వరకు వేతనం నిర్ణయించినట్టు తెలిసింది. డిప్యూటేషన్‌పై వర్సిటీలు, ప్రభుత్వశాఖల్లో పనిచేసే వారిని తీసుకునే వీలున్నా కన్సల్‌టెంట్ల పేరుతో నియామకాలు చేపట్టడంపై విమర్శలొస్తున్నాయి. ఉన్న త విద్యామండలి ఉన్నతాధికారి స్పందిస్తూ పరిశోధన, పరిశ్రమలను అనుసంధానించడంలో భాగంగాకొత్త వారిని నియమించుకున్నట్టు తెలిపారు.

- ఒక పోస్టులో ఓ ప్రైవేట్ వర్సిటీలో పనిచేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రీసెర్చ్ కన్సల్‌టెంట్‌గా దాదాపు లక్షరూపాయలకు పైగా వేతనమిచ్చి నియమించారు. ఇండస్ట్రీ కన్సల్‌టెంట్‌ను సైతం ఇలాగే నియమించారు.
- ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు ఓఎస్డీగా మరొకరిని నియమించారు. వాస్తవానికి ఉన్నత విద్యామండలిలో ఈ పోస్టులేదు. కానీ ఓ వ్యక్తిని నియమించారు.
- ఎన్ఎస్ఎస్ స్టేట్ కోఆర్డినేటర్ అనే పోస్టు లేనేలేదు. ఈ విభాగంతో ఉన్నత విద్యామండలికి సంబంధమే లేదు. ఈ పోస్టు వర్సిటీల్లోనే ఉంటుంది. వర్సిటీ వారిగా ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు ఉన్నారు. వారంతా ప్రొఫెసర్లే. కానీ పోస్టులేకపోయినా ఓ మహిళను స్టేట్ కో ఆర్డినేటర్‌గా పెట్టి, నెలకు రూ. 50వేలకు పైగా వేతనమిస్తున్నారు.

'డీపీహెచ్'లో వినతులు ఇవ్వాలన్నా ఆంక్షలే

మండిపడుతున్న ఉద్యోగులు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): ఒక శాఖలోని ఉద్యోగులు తమకు ఏదైనా సమస్యవస్తే పరిష్కారం కోసం హెచ్‌వోడీల దృష్టికి తీసుకెళ్తుంటారు. కానీ.. వైద్యశాఖలోని డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) లో మాత్రం వినతుల కోసం వచ్చే ఉద్యోగులపైనా ఆంక్షలు విధిస్తున్నారు. ఈ మేరకు తాజాగా ఉద్యోగులు సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్యే రావాలని ఉత్తర్వులు జారీ చేశారు. డీపీహెచ్ కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు తమపై అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని ఆదేశించడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు. గంట సమయంలో ఎంత మంది వినతులు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. డీపీహెచ్, ఇతర ఉన్నతాధికారులు తమ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి ఇలాంటి ఉత్తర్వులు జారీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

చేయి తడిపితే 'ఓకే'షనల్!

- కొన్నింటికే అనుమతులెందుకు?
- రాష్ట్రంలో 220 వొకేషనల్ కాలేజీల అనుమతులు పెండింగ్
- రెండు, మూడు కళాశాలలకు మాత్రం పర్మిషన్
- మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్నా ఓకే చెప్పిన అధికారులు
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతోనే అనుమతులిచ్చారని ఆరోపణలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): నిబంధనల ప్రకారం నిర్వహించటం లేదనే కారణంతో కొన్నేండ్ల క్రితం మూతపడ్డ వొకేషనల్ కాలేజీలకు ఇప్పుడు అనుమతులు వస్తున్నాయి. రాష్ట్రంలో 220 వొకేషనల్ కాలేజీల అనుమతులు పెండింగ్‌లో పెట్టిన అధికారులు కొన్నింటిపై మాత్రం 'ప్రత్యేక' ప్రేమ చూపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ నుంచి ఇంటర్‌బోర్డు అధికారుల వరకు కాసులకు కక్కుర్తిపడి గుడ్డిగా సంతకాలు పెట్టారని వొకేషనల్ అధ్యాపక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ వ్యవహారంలో రాజకీయ నేతల 'హస్తం'ఉన్నదని విమర్శలు గుప్పిస్తున్నారు.

నిబంధనలు పాటించకపోయినా..

వొకేషనల్ కాలేజీ ఏర్పాటుకు నిబంధనల ప్రకారం 8,000 చదరపు అడుగుల వైశాల్యం కలిగి ఉండాలి. సింగిల్ ఆక్యుపెన్సీ ఉండాలి. కళాశాల భవనంలో కుటుంబాలు నివాసం ఉండొద్దు. ఎలాంటి షాపులూ నిర్వహించొద్దు. ఫైర్ సేఫ్టీ రూల్స్ పక్కాగా పాటించాలి. అప్పుడే కాలేజీ నిర్వహణకు అనుమతులు మంజూరు చేస్తారు. ఈ నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో గతేడాది రాష్ట్రవ్యాప్తంగా సుమారు 220 కాలేజీల అనుమతులను నిలిపివేశారు. కానీ, కొన్నేండ్ల నుంచి మనుగడలో లేని, కనీస నిబంధనలు పాటించని పలు కాలేజీలకు మాత్రం పరిగెత్తుకుంటూ అనుమతులు ఇచ్చారు. నాలుగేండ్ల క్రితం సిద్దిపేట జిల్లాలో మూతపడ్డ ఓ పారామెడికల్ కాలేజీకి కేవలం 3,041 చదరపు అడుగుల వైశాల్యం, మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్నప్పటికీ, భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించనప్పటికీ తెరుచుకొనేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం సాగుతున్నది.

ఒకరికి మించి మరొకరు..

వొకేషనల్ కాలేజీలకు అనుమతిచ్చేందుకు అధికారులు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్టు అర్థమవుతున్నది. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సిన మున్సిపల్ అధికారులు కాలు బయటపెట్టకుండానే నిబంధనలు పాటించని సిద్దిపేటలోని ఓ కాలేజీకి సర్టిఫికెట్ జారీ చేస్తున్నట్టు తెలుస్తున్నది. బిల్డింగ్ నిర్మాణంలో నాణ్యతను తనిఖీ చేసి అనుమతిలివ్వాల్సిన మున్సిపల్ ఏఈలు కూడా నో అబ్జెక్షన్ పత్రం ఇస్తున్నట్టు వినికిడి. బల్దియా అధికారులు ఇచ్చిన వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సిన జిల్లా వొకేషనల్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు అధికారులు కూడా పచ్చజెండా ఊపుతున్నట్టు సమాచారం. కిందిస్థాయి అధికారుల నివేదికలోని అంశాలను పరిశీలించకుండానే వొకేషనల్ ఇంటర్మీడియట్ జాయింట్ డైరెక్టర్, డైరెక్టర్, సెక్రటరీ కూడా గుడ్డిగా సంతకాలు పెడుతున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ వ్యవహారంలో ఏదో తిర'కాసు'ఉన్నదనే ప్రచారం సాగుతున్నది.

రాజకీయ ఒత్తిళ్లే కారణం!

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రూల్స్ పాటించలేదనే కారణంతో నాలుగేండ్ల క్రితం వందలాది వొకేషనల్ కాలేజీలకు అధికారులు అనుమతులివ్వలేదు. అప్పటి నుంచి మూతపడే ఉంటున్నవి. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత కొన్నింటికీ మాత్రమే పర్మిషన్ రావడం చర్చనీయాంశమైంది. అదికూడా మే నెలలోగా కాకుండా నవంబర్‌లో అనుమతులివ్వడం గమనార్హం. కొందరు రాజకీయ నాయకులు అధికారులపై ఒత్తిడి తేవడం, వారు కూడా డబ్బులకు ఆశపడే నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినట్టు వొకేషనల్ అధ్యాపక, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ నెల 17 నుంచి 21 వరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతోపాటు రాష్ట్రపతి నిలయం అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ తగిన భద్రతా, ట్రాఫిక్, బందోబస్తు ప్రణాళికను రూపొందించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఆర్ అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హరీశ్, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల ముద్రణపై భిన్నాభిప్రాయాలు

- విద్యా కమిషన్‌ది ఓ తీరు.. విద్యాశాఖది మరో తీరు
- ఇంగ్లిష్ మీడియంలోనే ముద్రించాలన్న విద్యాకమిషన్
- తెలుగు, ఇంగ్లిష్‌లో ముద్రించాలన్న విద్యాశాఖ

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : వచ్చే విద్యాసంవత్సరంలో ఇచ్చే పాఠ్యపుస్తకాలను ఏ మీడియంలో ముద్రించాలన్న అంశంపై విద్యాశాఖ, విద్యా కమిషన్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. విద్యాకమిషన్ ఒక అభిప్రాయాన్ని వ్యక్తపర్చగా, విద్యాశాఖ మరోదారిలో ముందుకెళ్తున్నది. ఈ విషయంలో రెండింటికీ పొసగని పరిస్థితి నెలకొన్నది. ప్రతియేటా రాష్ట్రంలోని 1-10 విద్యార్థుల కోసం ద్విభాషా పుస్తకాలను ముద్రిస్తున్న విషయం తెలిసిందే. ఒకే పుస్తకంలో కుడి వైపు పేజీని తెలుగులో, ఎడమ వైపు పేజీని ఇంగ్లిష్‌లో ముద్రిస్తున్నారు. ఈ విధానంతో నష్టం జరుగుతుందన్న భావనలో విద్యాకమిషన్ ఉన్నది. విద్యార్థులు ఇంగ్లిష్ నైపుణ్యాలు నేర్చుకోలేకపోతున్నారని, దీనంతటికీ పుస్తకాలు తెలుగులో ఉండటమే కారణమన్న అభిప్రాయానికి వచ్చింది. మొత్తం ఇంగ్లిష్‌లోనే పుస్తకాలు ముద్రించాలన్న భావనతో ఉన్నది.

వచ్చే ఏడాదికి ద్విభాషా పుస్తకాలు..

ఇదిలా ఉండగా, వచ్చే విద్యాసంవత్సరానికి పాఠ్యపుస్తకాల ముద్రణ ప్రక్రియను ఇటీవలే విద్యాశాఖ ప్రారంభించింది. వచ్చే ఏడాదికి ద్విభాషా పుస్తకాలను ముద్రించాలని నిర్ణయించింది. పేజీలో ఒకవైపు తెలుగు, మరో వైపు ఇంగ్లిష్‌లో పాఠ్యపుస్తకాలు ఉండనున్నాయి. ద్విభాషా పుస్తకాల వినియోగంపై ఇటీవలే విద్యాకమిషన్ రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేపట్టింది. అయితే తెలుగు మీడియాన్ని పూర్తిగా ఎత్తివేసి, కేవలం ఇంగ్లిష్ మీడియంలోనే ముద్రించాలని నిర్ణయానికి వచ్చింది. ఇదే అంశంపై 'తెలుగు మాధ్యమానికి మంగళం' పేరుతో నమస్తే తెలంగాణ కథనాన్ని ప్రచురించింది. దీంతో తెలుగు భాషాభిమానుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. ఈక్రమంలో వచ్చే విద్యాసంవత్సరంలో పాఠ్యపుస్తకాలను తెలుగులోనూ ముద్రించనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తెలిపారు. పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ తల్లి చిత్రపటం, తెలంగాణ గీతం ముద్రించాలని నిర్ణయించినట్టు చెప్పారు.

సీబీటీ మోడ్‌లోనే సీయూఈటీ -యూజీ

- సబ్జెక్టుల సంఖ్య 63 నుంచి 37కు తగ్గింపు
- యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర విద్యాసంస్థల్లోని అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (సీయూఈటీ)లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కీలక మార్పులు చేపట్టింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి సీయూఈటీ (యూజీ) పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీటీబీ) పద్ధతిలోనే నిర్వహిస్తామని యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్ తెలిపారు. ఇక నుంచి విద్యార్థులు 12వ తరగతిలో చదివిన సబ్జెక్టులతో సంబంధంలేకుండా తమకు నచ్చిన పరీక్షలను రాయవచ్చని చెప్పారు. సీయూఈటీలో సబ్జెక్టుల సంఖ్యను 63 నుంచి 37కు తగ్గించినట్టు తెలిపారు.